నోటిఫికేషన్‌పై ఎస్‌టి కమిషన్‌కు ఫిర్యాదు

ప్రజాశక్తి - టెక్కలి

ఆంధ్రప్రదేశ్ సమగ్ర శిక్ష ఇటీవల విడుదల చేసిన టీచింగ్, నాన్‌టీచింగ్ ఉద్యోగ భర్తీ నోటిఫికేషన్‌లో ఆదివాసీలకు అన్యాయం జరిగిందని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షులు వాబ యోగి జాతీయ ఎస్‌టి కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. నోటిఫికేషన్‌లో 507 టీచింగ్ పోస్టులకు నోటిఫికేషన్ జారీ చేయగా, పది పోస్టులు మాత్రమే కేటాయించారని తెలిపారు. రాజ్యాంగ ప్రకారం ఆదివాసీలకు ఆరు శాతం రిజర్వేషన్ కల్పించాలని నిబంధనలు చెప్తున్నా, అందుకు విరుద్ధంగా ఈ నోటిఫికేషన్ ఉందన్నారు. రాష్ట్రంలో లక్షలాది మంది ఆదివాసీలు డిగ్రీ, బిఇడి, పిజిలు పూర్తి చేసి ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న వారికి తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. ఈ నోటిఫికేషన్ రీ షెడ్యూల్ చేయాలని కోరారు.

పిల్లలూ మీకే సబ్జెక్టు ఇష్టం..?

- మధ్యాహ్న భోజనం ఎలా ఉంది?
- యూనిఫాం, బ్యాగ్స్ బాగున్నాయా?
- విద్యాశాఖ మంత్రి లోకేష్ విద్యార్థులతో ముఖాముఖి
- శ్రీకాకుళం నగరంలోని ప్రాథమిక పాఠశాల ఆకస్మిక తనిఖీ

విద్యార్థులను ప్రశ్నలు అడుగుతున్న మంత్రి లోకేష్

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి, అర్బన్

పిల్లలూ మీకే సబ్జెక్టు ఇష్టమంటూ రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ అడిగిన ప్రశ్నలకు ఆ చిన్నారులు తమకు ఇంగ్లీష్, ఇవిఎస్ ఆసక్తి అంటూ బదులిచ్చారు. శ్రీకాకుళం నగరంలోని ఎచ్చెర్ల వీధిలో గల ప్రాథమిక పాఠశాలను గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలోని తరగతి గదుల్లోకి వెళ్లి చిన్నారులతో ముచ్చటించారు. కొద్దిసేపు ఉపాధ్యాయుడిగా మారి పలు వస్తువుల పేర్లను ఇంగ్లీష్‌లో ఏమంటారని అడిగి సమాధానాలను రాబట్టారు. చిన్నారులు హుషారుగా సమాధానాలు ఇవ్వడం, అల్లరి చేస్తూ కేరింతలు కొట్టడంపై మంత్రి లోకేష్ ఆనందం వ్యక్తం చేశారు. స్కూలులో మధ్యాహ్న భోజనం ఎలా ఉంది? అమ్మానాన్నలు ఏం చేస్తున్నారు? యూనిఫాం, బ్యాగ్స్ బాగున్నాయా? తదితర ప్రశ్నలు వేసి వివరాలను తెలుసుకున్నారు. అబ్బాయిలు క్లాస్‌రూమ్ తలుపు విరగ్గొట్టారని ఒక బాలిక చెప్పడంతో... మీరు రౌడీల మాదిరి ఉన్నారురా అంటూ సరదాగా వారితో చమత్కరించారు. చిన్నప్పుడు తానూ అల్లరి చేసే వాడినని చెప్పారు. విద్యార్థులకు ఏం కావాలని అడిగినప్పుడు బెంచీలు కావాలని చెప్పడంతో త్వరలో ఏర్పాటు చేస్తామని చెప్పారు. విద్యార్థులు బాగా చదువుకుని తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలి, ముఖ్యంగా అమ్మను బాగా చూసుకోవాలని చెప్పారు. అలాగే చేస్తామంటూ విద్యార్థులు ముక్తకంఠంతో సమాధానమిచ్చారు. విద్యార్థుల వర్క్ బుక్‌ను పరిశీలించిన మంత్రి చిన్నారుల హ్యాండ్ రైటింగ్ బాగుందని కితాబిచ్చారు. హ్యాండ్ రైటింగ్ మెరుగుదల కోసం కాపీరైట్ బుక్స్ రాయిస్తున్నామని టీచర్లు చెప్పగా వారిని అభినందించారు. రాష్ట్రంలోని అన్ని స్కూళ్లలో ఇదే విధానాన్ని అమలు చేసే అంశాన్ని పరిశీలిస్తామని లోకేష్ చెప్పారు. మధ్యాహ్న భోజనంపై స్థానిక ఆహారంపై విద్యార్థులు మక్కువ చూపుతున్నందున, వాటిని మెనూలో చేర్చే అంశాన్ని పరిశీలించాల్సిందిగా అధికారులకు సూచించారు.

ప్రభుత్వ బడుల దుస్థితి ప్రత్యక్ష అనుభవం

జిల్లాలో నాడు-నేడు పనులకు నోచుకోలేకపోయిన పలు ప్రభుత్వ బడుల దుస్థితి ఎలా ఉంటుందో మంత్రి లోకేష్‌కు ప్రత్యక్ష అనుభవం ఎదురైంది. పాఠశాల సందర్శనకు ఆయన వచ్చినప్పుడు ప్రాంగణం లోపల భారీ వర్షపు నీరు చేరింది. ఆ నీటిలోనే నడుచుకుంటూ తరగతి గదులకు వెళ్లారు. స్టాఫ్‌రూమ్‌గా వినియోగిస్తున్న పాత స్కూల్ భవనంలో కొద్దిసేపు ఉపాధ్యాయులు, ఎంఇఒతో కొద్దిసేపు సమావేశమయ్యారు. బయట వైపు ఉన్న ఆ భవనం పైకప్పు శిథిలం కావడంతో వర్షపు నీరు కారుతోంది. వర్షపుధారల్లోనే తడుచుకుంటూ ఆయన బయటకు వచ్చారు.

టీచర్లు, ఎంఇఒతో మంత్రి సమావేశం

తరగతి గదుల పరిశీలన అనంతరం టీచర్లు, ఎంఇఒ, స్కూలు సిబ్బందితో మంత్రి లోకేష్ సమావేశమయ్యారు. ప్రభుత్వ స్కూళ్లపై అవగాహన కోసమే తాను ఆకస్మిక తనిఖీలు చేస్తున్నట్లు చెప్పారు. ఈ స్కూలు నిర్మాణం జరిగి వంద సంవత్సరాలు అయిందని టీచర్లు చెప్పగా, మంత్రి ఆశ్చర్యం వ్యక్తంచేశారు. కొన్ని తరగతి గదులు శిథిలావస్థకు చేరుకున్నాయని, తామే సొంతంగా రూ.50వేలు ఖర్చు చేసి చిన్నచిన్న మరమ్మతులు చేయించినట్లు చెప్పారు. నాడు-నేడు ఫేజ్-1, ఫేజ్-2లో తమ స్కూలుకు ఎటువంటి నిధులు విడుదల కాలేదన్నారు. వర్షం వచ్చినపుడు తరగతి గదుల్లోకి నీరు వస్తోందని, మరమ్మతులకు నిధులు విడుదల చేయాలని కోరారు. ప్రభుత్వ స్కూళ్లలో తొలుత కనీస మౌలిక సదుపాయాలు కల్పించి, తర్వాత అన్నింటినీ ఒకేలా అభివృద్ధి చేస్తామని చెప్పారు. ఈ స్కూలులో అటెండెన్స్, ఫలితాలు బాగున్నాయని మంత్రి సంతృప్తి వ్యక్తం చేశారు. జీతం సరిగా అందడంలేదని ఆయా చెప్పగా, అటువంటి సమస్య తలెత్తకుండా చూడాలని ఎంఇఒను ఆదేశించారు.

ప్రతి తరగతికీ ఒక ఉపాధ్యాయుడు

వచ్చే ఏడాది నుంచి ప్రతి తరగతికీ ఒక ఉపాధ్యాయుడు ఉంటేలా చర్యలు తీసుకుంటామని మంత్రి లోకేష్ చెప్పారు. తొలుత ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు తొలుత చర్యలు తీసుకుంటామన్నారు. వచ్చే ఐదేళ్లలో దేశంలోనే ఆదర్శంగా రాష్ట్రంలోని పాఠశాలలను తీర్చిదిద్దుతామని తెలిపారు. గత ప్రభుత్వ అనాలోచిత చర్యల కారణంగా కొన్ని తప్పిదాలు జరిగాయని, ఈసారి అవి పునరావృతం కాకుండా ప్రణాళికాబద్ధంగా సంస్కరణలు అమలు చేస్తామని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో పరిస్థితులన్నింటినీ ఒకేసారి మార్చడం సాధ్యం కాదని చెప్పారు. స్కూళ్లలోని మౌలిక సదుపాయాల వాస్తవ చిత్రాలను ఎప్పటికప్పుడు డ్యాష్ బోర్డులో అప్‌లోడ్ చేయాలని ఎంఇఒను ఆదేశించారు. ప్రభుత్వ స్కూళ్లను బలోపేతం చేసి నాణ్యత పెంచేందుకు చర్యలు చేపట్టాలన్నారు. ఈ సందర్భంగా స్కూళ్లలో నాణ్యత పెంచేందుకు టీచర్ల సలహాలు తీసుకున్నారు. సబ్జెక్టుల వారీగా బోధనకు స్కూల్ అసిస్టెంట్లు తక్కువగా ఉన్నారని మంత్రి దృష్టికి తెచ్చారు. ఇటీవల వర్క్ అడ్జస్ట్‌మెంట్ ద్వారా కొన్నింటిని సరిచేశామని, వచ్చే ఏడాది మరింత పకడ్బందీగా అమలు చేస్తామని చెప్పారు. మంత్రి లోకేష్ వెంట ఎమ్మెల్యే గొండు శంకర్, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవి, ఎంఇఒ ఎస్.కృష్ణారావు, హెచ్‌ఎం అరుణకుమారి పాల్గొన్నారు.

మండల వీధి సమీపాన రోడ్డుపై ప్రవహిస్తున్న వర్షపునీరు

విస్తారంగా వర్షాలు

- బంగాళాఖాతంలో ద్రోణి ప్రభావం
- తడిసి ముద్దయిన శ్రీకాకుళం నగరం
- నేడూ తేలికపాటి జల్లులు కురిసే అవకాశం

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి, అర్బన్

బంగాళాఖాతంలో ఏర్పడిన ద్రోణి ప్రభావంతో జిల్లాలో గురువారం పలుచోట్ల మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిశాయి. శ్రీకాకుళం నగరంలో అత్యధికంగా 31.75 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. ఎచ్చెర్లలో 28 మి.మీ, నరసన్నపేటలో 20.75 మి.మీ, ఆమదాలవలసలో 19.75 మి.మీ, సంతబొమ్మాళిలో 19.25 మి.మీ మేర వర్షం పడింది. ఇచ్ఛాపురం మండలం బొడ్డపడలో 17.75 మి.మీ, టెక్కలిలో 17మి.మీ, హిరమండలం గొట్టాబ్యారేజి ప్రాంతంలో 15.5 మి.మీ వర్షపాతం నమోదైంది. పలాసలో 11.75 మి.మీ, రణస్థలం మండలం గరికిపాలెంలో 10.25 మి.మీ, ఎల్ఎన్‌పేటలో 9.5 మి.మీ, లావేరులో 8.75 మి.మీ, పొందూరులో 6.75 మి.మీ, గారలో 6 మి.మీ వర్షం కురిసింది. బంగాళాఖాతంలో ద్రోణి ప్రభావంతో శుక్రవారం తేలికపాటి వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ తెలిపింది. మత్స్యకారులెవరూ చేపల వేటకు వెళ్లొద్దని హెచ్చరించింది.

తడిసి ముద్దయిన శ్రీకాకుళం నగరం

వర్షానికి శ్రీకాకుళం నగరం తడిసి ముద్దయింది. సుమారు గంటన్నర సేపు ఏకధాటిగా కురిసిన వర్షంతో కాలువల్లో మురుగునీరు రోడ్లపైనే ప్రవహించింది. ప్రధాన రహదారుల్లో మురుగునీరు ముంచెత్తడంతో నగరవాసులు ఇబ్బందులు పడ్డారు. లోతట్టు ప్రాంతాల్లో నీరు చేరింది. కాలువల పరిస్థితిని గమనించేందుకు ఆ సమయంలో నగరంలో ఉన్న ఎమ్మెల్యే గొండు శంకర్, నగరపాలక సంస్థ కమిషనర్ ప్రసాదరావుతో కలసి పలు ప్రాంతాల్లో పర్యటించారు. వర్షపు నీరు కాలువల్లోకి ప్రవేశించే మార్గాల్లో పూడికలను తొలగించేందుకు చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే కమిషనర్‌కు సూచించారు. నగరంలోని కళింగ రోడ్డు, ఫారెస్టు ఆఫీసు రోడ్డు, పిఎస్ఎన్ఎం స్కూల్ జంక్షన్, ఆర్‌టిసి కాంప్లెక్స్, హౌసింగ్ బోర్డు కాలనీ పరిసరాల్లో రోడ్లు జలమయమయ్యాయి.

రోడ్లపై ప్రవాహాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే, కమిషనర్

రూ.25 లక్షల పరిహారం ఇవ్వాలి

ఎస్ఎఫ్ఐ డిమాండ్

ప్రజాశక్తి - రణస్థలం, శ్రీకాకుళం అర్బన్

పాతర్లపల్లి పాఠశాల భవనం సన్ షేడ్ కూలి పదో తరగతి విద్యార్థి కృష్ణంరాజు మృతి చెందడం బాధాకరమని, విద్యార్థి కుటుంబానికి రూ.25 లక్షల పరిహారం, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇచ్చి ఆదుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డి.చందు, బి.హరీష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పాతర్లపల్లి ఉన్నత పాఠశాలలో సంఘటనా స్థలాన్ని గురువారం పరిశీలించారు. పోస్టుమార్టం అనంతరం పాతర్లపల్లి తీసుకొచ్చిన విద్యార్థి మృతదేహానికి ఎస్ఎఫ్ఐ నాయకులు, సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్ అమ్మన్నాయుడు నివాళి అర్పించి కుటుంబసభ్యులకు సానుభూతి తెలిపారు. శ్రీకాకుళంలోని ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో గాయపడి చికిత్స పొందుతున్న మరో విద్యార్థి శ్రీరామ్‌ను ఎస్ఎఫ్ఐ నాయకులు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, నగర కన్వీనర్ ఆర్.ప్రకాష్ పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ యంత్రాంగం నిర్లక్ష్యం కారణంగానే విద్యార్థి మృతి చెందారని చెప్పారు. గాయపడిన విద్యార్థి శ్రీరామ్‌కు మెరుగైన వైద్యం అందించాలని కోరారు. ఏ పాఠశాలలోనూ ఇటువంటి సంఘటనలు చోటుచేసుకోకుండా ప్రభుత్వ యంత్రాంగం పకడ్బందీ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. వీరితోపాటు ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు సంతోష్ ఉన్నారు.

శ్రీకాకుళం అర్బన్ : విద్యార్థిని పరామర్శిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

రాష్ట్రాన్ని అగ్రస్థానంలో నిలబెడతాం

కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు

ప్రజాశక్తి - వజ్రపుకొత్తూరు

అభివృద్ధిలో ఆంధ్రప్రదేశ్‌లో అగ్రస్థానంలో నిలబెడతామని కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. మండలంలోని మంచినీళ్లపేటలో ఎమ్మెల్యే గౌతు శిరీష అధ్యక్షతన గురువారం నిర్వహించిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంధకారంలోకి వెళ్లిన రాష్ట్రాన్ని కూటమి ప్రభుత్వం తిరిగి వెలుగుల్లోకి తెచ్చిందని, వంద రోజుల పాలనలో ఎన్నో ఘనతలు సాధించామన్నారు. రాష్ట్రం ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నా ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని చెప్పారు. మూలపేట పోర్టును ఏడాదిలో పూర్తి చేసి మత్స్యకారులకు ఉద్యోగావకాశాలు కల్పిస్తామని హామీనిచ్చారు. నౌపడ-పూండీ రహదారిని అభివృద్ధి చేస్తామని హామీనిచ్చారు. గత ప్రభుత్వంలో అప్పటి మంత్రి పోలీసులను అడ్డం పెట్టుకొని అక్రమ కేసులు, కొండలు దోపిడీ, స్థలాలు కబ్జా తప్ప చేసిన అభివృద్ధి ఏదీ లేదని విమర్శించారు.

వెంటిలేటర్‌పై రాష్ట్ర ప్రభుత్వం

గత ప్రభుత్వ అప్పులతో రాష్ట్ర ప్రభుత్వం వెంటిలేటర్‌పై ఉందని, కేంద్రం సహకారం లేకపోతే మనుగడ కష్టమని వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు అన్నారు. పదవులు శాశ్వతం కాదని, చేసిన మంచి పనులే చిరస్థాయిగా నిలిచిపోతాయన్నారు.

ఉద్దానం ప్రాంతానికి ప్రత్యేకంగా మళ్లీ ఉద్యానశాఖ ఎడి కార్యాలయం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఫిష్ ల్యాండ్ సెంటర్‌ను పూర్తి చేస్తామని హామీనిచ్చారు. ఎమ్మెల్యే గౌతు శిరీష మాట్లాడుతూ మత్స్యకారుల కోసం ఇక్కడే ఫిషింగ్ జెట్టీ త్వరలోనే పూర్తి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గుళ్ల చిన్నారావు, టిడిపి నాయకులు పీరుకట్ల విఠల్, జనసేన నాయకులు దుర్గారావు, మాజీ ఎంపిపి గొరకల వసంతరావు, టిడిపి మండల అధ్యక్షులు సూరాడ మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మంత్రి అచ్చెన్నాయుడు

జెండా ఊపి లారీని ప్రారంభిస్తున్న రామ్మోహన్ నాయుడు, అచ్చెన్నాయుడు, శిరీష

తిరుపతి లడ్డూకు పలాస జీడిపప్పు

మూడు లారీల్లో 30 టన్నులు సరఫరా

ప్రజాశక్తి - పలాస

తిరుమల తిరుపతి దేవస్థానం లడ్డూ ప్రసాదం తయారీకి నాణ్యమైన పలాస జీడిపప్పును వినియోగించనున్నట్లు కేంద్ర, రాష్ట్ర మంత్రులు కింజరాపు రామ్మోహన్ నాయుడు, అచ్చెన్నాయుడు తెలిపారు. పలాస నుంచి టిటిడికి జీడిపప్పు లారీని ఎమ్మెల్యే గౌతు శిరీషతో కలిసి జెండా ఊపి గురువారం ప్రారంభించారు. తొలి రోజు 30 టన్నుల జీడిపప్పును పంపించినట్లు తెలిపారు. గత ప్రభుత్వం లడ్డూ ప్రసాదంలో నాణ్యత లేని జీడిపప్పును వినియోగించిందని విమర్శించారు. పలాస జీడిపప్పు వినియోగంతో లడ్డూ ప్రసాదం నాణ్యత, రుచి మరింత మెరుగవుతుందని అభిప్రాయపడ్డారు. పలాస ఖ్యాతి ప్రపంచవ్యాప్తం కావాలని ఆకాంక్షించారు. ఎస్ఎస్ఎస్ ఇంటర్నేషనల్ ఆగ్రోస్ సంస్థ చైర్మన్ కోరాడ సంతోష్ కుమార్ మాట్లాడుతూ నాణ్యతలో రాజీ లేకుండా మొత్తం గ్రేడింగ్ చేశామన్నారు. కార్యక్రమంలో సంస్థ అడ్వైజర్ అంధవరపు రతన్‌బాబు, పి.వి సతీష్ కుమార్, పారిశ్రామికవాడ అధ్యక్షులు మల్లా రామేశ్వరరావు, టంకాల రవిశంకర్ గుప్తా, పీరుకట్ల విఠల్‌రావు తదితరులు పాల్గొన్నారు.

భూగర్భ గనులశాఖ డీడీగా మోహనరావు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

మోహనరావు

భూగర్భ గనుల శాఖ డీడీగా సి.మోహనరావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. విజయవాడ కమిషనరేట్‌లో పనిచేసిన ఆయన్ను ప్రభుత్వం బదిలీపై ఇక్కడ డీడీగా నియమించింది.

జిఎస్‌టి డిసిగా కామరాజు

జిఎస్‌టి సర్కిల్ డిప్యూటీ కమిషనర్‌గా బడే కామరాజుకు ఉద్యోగోన్నతి లభించింది. వాణిజ్య పన్నుల శాఖ కార్యాలయంలో ఆయన గురువారం బాధ్యతలు చేపట్టారు. జిఎస్‌టి అధికారిగా నియమితులైన రాయి వేణుగోపాల్ కూడా బాధ్యతలు చేపట్టారు.

సత్ప్రవర్తనతో మెలగాలి

జిల్లా జడ్జి జునైద్ అహ్మద్ మౌలానా

ప్రజాశక్తి - శ్రీకాకుళం లీగల్

ఖైదీలు సత్ప్రవర్తనతో మెలగాలని జిల్లా జడ్జి జునైద్ అహ్మద్ మౌలానా సూచించారు. మండలంలోని అంపోలులో గల జిల్లా జైలులో ముద్దాయిలకు న్యాయ అవగాహన సదస్సును గురువారం నిర్వహించారు. ఖైదీలతో మాట్లాడి భోజన సదుపాయాలు, ఆరోగ్య పరిస్థితులు, అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. ముద్దాయిలకు న్యాయపరమైన సలహాలు, సూచనలు అవగాహనా సదస్సులో అందించారు. కార్యక్రమంలో న్యాయసేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు, జైలు సూపరింటెండెంట్ తదితరులు పాల్గొన్నారు.

భోజనం నాణ్యతను పరిశీలిస్తున్న జిల్లా జడ్జి

సుందర నగరంగా శ్రీకాకుళం

కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

శ్రీకాకుళం నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దడమే ప్రతిఒక్కరి లక్ష్యం కావాలని, అందులో భాగంగా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పిలుపునిచ్చారు. నాగావళి నది రివర్‌వ్యూ పార్కు పరిసరాల్లో ఎస్‌పి కె.వి మహేశ్వరరెడ్డి, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, ఎమ్మెల్యే గొండు శంకర్‌తో కలిసి స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాన్ని గురువారం చేపట్టారు. నగరంలో మురుగునీరంతా నాగావళి నదిలోకి చేరడం వల్ల కలుషితమవుతోందన్నారు. ఈ నీటిని ప్రజలతో పాటు ఇతర జీవరాశులు వినియోగించడం వల్ల రోగాల బారిన పడే ప్రమాదముందన్నారు. అందువల్ల మురుగునీటిని శుద్ధి చేసి నదిలోకి పంపించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. శుద్ధి ప్లాంటు ఏర్పాటుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేయడంతో పాటు స్థలాన్ని కేటాయించినట్లు తెలిపారు. పరిసరాల పరిశుభ్రతతో ప్రజలు భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే గొండు శంకర్ మాట్లాడుతూ నదులను సంరక్షించుకోవడం అందరి బాధ్యత అని అన్నారు. నది ఒడ్డున ప్రత్యేకంగా రోడ్డును అభివృద్ధి చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశామన్నారు. అనంతరం నాడ్ వాల్‌పెయింటింగ్‌లో పాల్గొని చేతిముద్రలను వేశారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ కమిషనర్ పి.వి.వి.డి ప్రసాదరావు, జిల్లా పరిశ్రమల జనరల్ మేనేజర్ ఉమామహేశ్వరరావు, డిఎంహెచ్ఒ బి.మీనాక్షి, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఇఇ బి.కరుణశ్రీ, మున్సిపల్ హెల్త్ఆఫీసర్ సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

నాగావళి నదీ పరిసరాలను పరిశుభ్రం చేస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే తదితరులు

పోలీసు సిబ్బంది సంక్షేమానికి ప్రాధాన్యం

ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి

ప్రజాశక్తి - శ్రీకాకుళం

జిల్లా పోలీసు సిబ్బంది సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి తెలిపారు. పోలీసు సిబ్బంది సమస్యల పరిష్కారం కోసం జిల్లా పోలీసు కార్యాలయంలో గురువారం గ్రీవెన్స్ డేను నిర్వహించారు. జిల్లాలో పలు పోలీస్‌స్టేషన్లు, ఆర్మ్‌డ్ రిజర్వు, ఇతర విభాగాల్లో విధులు నిర్వర్తిస్తున్న 32 మంది పోలీసులు వారి వ్యక్తిగత, ఉద్యోగ సమస్యలపై ఎస్‌పికి విన్నవించారు. బదిలీలు, సీనియార్టీ ప్రమోషన్స్, సరెండరు లీవ్స్ మంజూరు, ఇన్‌కమ్ టాక్స్ రికవరీ, ఆరోగ్య పరమైన సమస్యలు వంటి వాటిపై వినతిపత్రాలు అందజేశారు. సమస్యలను కూలంకషంగా విన్న ఎస్‌పి, తగిన పరిష్కారం చూపుతానని భరోసా కల్పించారు. ఆయా ఫిర్యాదులపై సంబంధిత జిల్లా పోలీస్ కార్యాలయ అధికారులతో మాట్లాడి త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు.

సమస్యలను తెలుసుకుంటున్న ఎస్‌పి మహేశ్వర రెడ్డి

విద్యార్థి మృతిపై నివేదిక ఇవ్వాలి

బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు సీతారాం

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

రణస్థలం మండలం పాతర్లపల్లిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సన్ షేడ్ కూలి పదో తరగతి విద్యార్థి వనం కృష్ణంరాజు మృతి చెందిన ఘటనపై నివేదిక ఇవ్వాలని బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారాం జిల్లా విద్యాశాఖ అధికారిని ఆదేశించారు. ఈమేరకు గురువారం ఒక ప్రకటనను విడుదల చేశారు. ఈ ఘటనపై కమిషన్ తీవ్ర దిగ్భ్రాంతికి గురైనట్లు తెలిపారు. ఇటువంటి ప్రమాదం సంభవించకుండా ముందే తగిన భద్రతా చర్యలు తీసుకుని ఉండాల్సిందని అభిప్రాయపడ్డారు. జిల్లాలో ఇటువంటి భద్రతా గోడలు లేని పాఠశాలలను గుర్తించి యుద్ధప్రాతిపదికన నివేదిస్తే, ఉన్నతాధికారులకు సిఫార్సు చేస్తామని పేర్కొన్నారు.

నేడు వికలాంగుల గ్రీవెన్స్

శ్రీకాకుళం అర్బన్ : వికలాంగుల స్వాభిమాన్ ప్రత్యేక గ్రీవెన్స్‌ను జిల్లాపరిషత్ సమావేశ మందిరంలో శుక్రవారం నిర్వహిస్తున్నట్లు వికలాంగుల శాఖ ఎడి కె.కవిత ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం పది నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహించనున్న కార్యక్రమంలో వికలాంగుల సమస్యలపై వినతులను స్వీకరించనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని వికలాంగులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయం


బూర్జ : మాట్లాడుతున్న ఎమ్మెల్యే రవికుమార్

ప్రజాశక్తి- బూర్జ

ప్రభుత్వ ఆస్తులను, భూములను కాపాడే బాధ్యత ప్రభుత్వ ఉద్యోగులదేనని ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ స్పష్టం చేశారు. గురువారం మండలంలోని పాలవలసలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా తమ గ్రామంలో అంగన్వాడీ భవనం ఉన్నప్పటికీ వినియోగించకుండా వేరే గృహంలో విధులు నిర్వహిస్తున్నారని, దీనివలన లక్షల రూపాయలు వెచ్చించి నిర్మించిన అంగన్వాడీ భవనం ముందు ఇతరులు ఆక్రమలు చేస్తున్నారని, వెంటనే భవనం ముందు అక్రమంగా వేసిన రేకులషెడ్‌ను తొలగించాలని ఎమ్మెల్యే దష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే ఆయా గ్రామాల్లో ఉన్న ప్రభుత్వ ఉద్యోగులు ప్రభుత్వ ఆస్తులను కాపాడేందుకు చొరవ చూపాలన్నారు. అధికారులు ఎప్పటికప్పుడు గ్రామాల్లో పరిశీలన జరిపి ప్రభుత్వ భూములు, ఇతర ఆస్తులు అన్యాక్రాంతం కాకుండా చూడాలన్నారు. అలాగే ఎంపిడిఒ, తహశీల్దార్ అంగన్వాడీ భవనం వినియోగంలోకి తీసుకువచ్చేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. గ్రామస్థాయిలో ఎటువంటి సమస్యలున్నా కూటమి ప్రభుత్వం ద్వారా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కేవలం వంద రోజుల్లోనే ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చిన ఘనత కూటమి ప్రభుత్వానికి చెందుతుందన్నారు. అంతకు ముందు ఇంటింటికి వెళ్లి స్టిక్కర్లను అందజేశారు. కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ డైరెక్టర్ ఆనెపు రామకృష్ణ నాయుడు, మాజీ ఎమ్మెల్సీ పీరుకట్ల విశ్వప్రసాద్, మండల పార్టీ అధ్యక్షుడు వావిలపల్లి సీతారాం బాబు, పైడి సత్యప్రసాద్, జల్లు పోలినాయుడు, రామినాయుడు, ఎంపిడిఒ తిరుపతిరావు, ఇఒపిఆర్‌డి విజయలక్ష్మి, ఎఒ శ్రీనివాసరావు, ఎపిఒ రాజ్‌కుమార్, ఎస్‌ఐ ప్రవళ్లిక పాల్గొన్నారు.

ఆమదాలవలస: పురపాలక సంఘ పరిధిలోని 13వ వార్డులో మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ తమ్మినేని గీతాసాగర్ ఆధ్వర్యంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కూన రవికుమార్ వార్డులోని పలు వీధుల్లో పర్యటించి ఇంటింటికి వెళ్లి కూటమి ప్రభుత్వం 100 రోజుల పాలనపై మహిళలకు వివరించారు. ఇది మంచి ప్రభుత్వం పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ పూజారి బాలాజీ ప్రసాద్, టిడిపి నాయకులు తమ్మినేని విద్యాసాగర్, సంపదరావు మురళి, మాజీ మున్సిపల్ చైర్మన్ కూన అప్పల నాయుడు, బొడ్డేపల్లి గౌరీపతి, తమ్మినేని అప్పలనాయుడు పాల్గొన్నారు.

కొబ్బరి మొక్కను నాటుతున్న ఎంపీ, ఎమ్మెల్యే

రణస్థలం రూరల్: స్వర్ణాంధ్ర సాధనే ప్రభుత్వ లక్ష్యమని ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు పేర్కొన్నారు. మండల కేంద్రంలో ఇది మంచి ప్రభుత్వం ముగింపు సభ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరించారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి డిజిఎం ఆనందరావు, కూటమి నాయకులు లెంక శ్యాం, పిన్నింటి భానోజీనాయుడు, పిసిని జగన్నాధం నాయుడు, కె.లక్ష్మణరావు, శ్రీనివాసరావు, బస్వ గోవిందరెడ్డి, ఆకెళ్ళ సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం రూరల్: గార మండలం ఇబ్రహీంబాద్‌లో ఇది మన మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గొండు శంకర్ పాల్గొన్నారు. ప్రతి ఇంటికి వెళ్లి సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాల వివరాలు తెలియజేసే పోస్టరు, స్టిక్కర్లు అంటించే కార్యక్రమం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

జలుమూరు : ప్రజా సంక్షేమమే ధ్యేయంగా టిడిపి కూటమి ప్రభుత్వం పాలన అందిస్తుందని ఎమ్మెల్యే బగ్గు వెంకటరమణ అన్నారు. మండలంలోని శ్రీముఖలింగంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. అనంతరం రూ.20 లక్షలతో సిసి రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి ప్రతినిధి మెండ రాంబాబు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వెలమల చంద్రభూషణ్, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి బగ్గు గోవిందరావు, సర్పంచ్‌లు తమ్మనగారి సతీష్ కుమార్, పంచిరెడ్డి రామచంద్రరావు, తహశీల్దార్ దేవ, ఎంపిడిఒ పాల్గొన్నారు.

కొత్తూరు : మండలంలోని మెట్టూరు బిట్-3లో నిర్వహించిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే మామిడి గోవిందరావు పాల్గొన్నారు. ఈ మేరకు వంద రోజుల పాలనపై వివరించారు. కార్యక్రమంలో మండల పరిషత్ వైస్ ఎంపిపి లోతుగెడ్డ తులసీవరప్రసాదరావు, ఎంపిడిఒ ఎం.పావని, సర్పంచ్ కొయిలాపు శ్రీనివాసరావు, టిడిపి నాయకులు మాతల గాంధీ, వై.దాసునాయుడు, ఎ.మాధవరావు, జి.కమలాకర్, దశరథరావు పాల్గొన్నారు.

పాతపట్నం : కూటమి ప్రభుత్వం ఏర్పడి వంద రోజులు పూర్తయిన సందర్భంగా ఒమండలంలోని ఆర్.ఎల్.పురంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే మామిడి గోవిందరావు పాల్గొన్నారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలతో ముద్రించిన పోస్టర్లను పంపిణీ చేశారు. అనంతరం ఐసిడిఎస్ ఆధ్వర్యాన నిర్వహించిన మాసోత్సవాల్లో గర్భిణులకు సీమంతాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ పిఒ విమలారాణి, సర్పంచ్ ప్రతినిధి అంపోలు మధుబాబు, టిడిపి మండల అధ్యక్షులు పైల బాబ్జి, సైలాడ సతీష్, తిట్టిమి చెన్నయ్య, పారసెల్లి రామరాజు పాల్గొన్నారు.

లావేరు: మండలం బెజ్జిపురంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావుతో కలిసి పాల్గొన్నారు.

జలుమూరు : మాట్లాడుతున్న ఎమ్మెల్యే రమణమూర్తి

ముందుగా గ్రామంలో ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. అనంతరం మొక్కలు నాటారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు ముప్పుడి సురేష్, బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఇజ్జాడ శ్రీనువాసరావు, ఎంపిడిఒ కె.సురేష్ కుమార్, ఎపిఒ రెడ్డి సత్యవతి, పిన్నింటి మధుబాబు, గంట్యాడ అప్పలనాయుడు, వడ్డిపల్లి శ్రీనువాసరావు, లంక శ్యాం, కూటమి నాయకులు పాల్గొన్నారు.

నౌపడ : మండలంలోని సీతానగరంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా వంద రోజుల పాలనపై ముద్రించిన పోస్టర్లను టిడిపి కూటమి నాయకులు ఇంటింటికీ వెళ్లి పంపిణీ చేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు వాడరేవు కృష్ణారావు, బచ్చుల చిన్నబాబు, జనసేన నాయకులు లింగూడు కుమార్, కార్యదర్శులు రాజు, ఉమాపతి, సచివాలయ ఉద్యోగులు వి.వెంకటనారాయణ, గవరయ్య, కల్పన, సుగుణ, కర్రి శంకర్, బ్రహ్మానందం, గోపాల్ పాల్గొన్నారు.

కోటబొమ్మాళి: మండలంలోని బంజీరుపేటలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా టిడిపి నాయకులు ఇంటింటికీ వెళ్లి పోస్టర్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు బోయిన రమేష్, టౌన్ ప్రెసిడెంట్ కోరాడ గోవిందరావు, ఎస్.రాంకుమార్, కార్యదర్శి చింతాడ సన్యాసిరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : టిడిపి కూటమి ప్రభుత్వం సంక్షేమంపై దృష్టిసారించిందని టిడిపి జిల్లా లీగల్ సెల్ ప్రతినిధి, పట్టణ పార్టీ ఉపాధ్యక్షులు నాగరాజ్ పాత్రో, జిల్లా మైనారిటీ సెల్ ప్రతినిధి ఎం.డి.జిలానీ, 17వ వార్డు ఇన్‌ఛార్జి జన్నెల సంతోష్, జనసేన ప్రతినిధి కర్రి నాగరాజు అన్నారు. ఆర్అండ్‌బి బంగ్లా ఆవరణలో మున్సిపల్ మేనేజర్ అప్పలస్వామి అధ్యక్షతన వార్డుల సచివాలయం అడ్మిన్ ప్రియాంక సమన్వయంతో సభ నిర్వహించారు. కార్యక్రమంలో వెల్ఫేర్ సెక్రటరీ హుస్సేన్, కార్యదర్శులు స్వాతి, ఎర్రమ్మ, హేమలత, గీతారాణి, ఆర్‌పిలు సీతామహాలక్ష్మి, రజని పాల్గొన్నారు.

పలాస : మండలంలోని బ్రాహ్మణతర్లాలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా టిడిపి నాయకులు ఇంటింటికీ వెళ్లి పోస్టర్లను అందజేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు వడ్డీ యాదగిరి, ఆళ్ల వెంకటరావు, ఆళ్ల కృష్ణారావు, ఆర్.సుధాకర్, బెండి రమేష్, బమ్మిడి ఆనందరావు, కార్యదర్శి లక్ష్మణ రేఖ, కంచరాన చాణక్య పాల్గొన్నారు.

నౌపడ : పోస్టర్లను పంపిణీ చేస్తున్న నాయకులు

కూటమి నాయకుల వాదులాట

రణస్థలం: మండల కేంద్రం జె.ఆర్.పురం పంచాయతీ పరిధిలోని మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు రాకముందే కూటమి నాయకులు, అధికారులు, మహిళా సంఘాల మహిళలు హాజరయ్యారు. రణస్థలం మాజీ ఎంపిపి, టిడిపి సీనియర్ నాయకుడు డిజిఎం ఆనందరావు ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నోడల్ ఆఫీసర్, రణస్థలం ఐసిడిఎస్ సిడిపిఒ ఝాన్సీతో మాట్లాడుతూ స్టేజ్ పైకి ఎవరిని పిలుస్తున్నారని అడిగారు. ఎమ్మెల్యే కార్యాలయం నుంచి స్టేజ్‌పైకి పిలిచే వారి లిస్టు వచ్చిందని పేర్ల లిస్ట్‌ని చూపించారు. పేర్ల లిస్ట్ చూసిన డిజిఎం ఆనందరావు కోపంతో ఊగిపోయారు. జె.ఆర్.పురం పంచాయతీలో ప్రభుత్వ కార్యక్రమైనా, పార్టీ కార్యక్రమాలైనా తన ఆధ్వర్యంలో జరగాలని మండిపడ్డారు. ఈ పంచాయతీకి ఎటువంటి సంబంధం లేని వ్యక్తులు స్టేజ్ పైకి పిలవడమేమిటని కోపంతో ఊగిపోయారు. పేర్ల లిస్ట్‌లో ఉన్న నారాయణశెట్టి శ్రీనివాసరావు, కోప్పుశెట్టి లక్మణరావు, దన్నాన మహేష్, తిప్పాన బాబురావు, దన్నాన చిరంజీవి తదితర పేర్లు పెట్టి వీరందరికీ స్టేజ్‌పైకి వచ్చే అర్హత లేదని అవమానించడంతో సభలో ఉన్న వీరంతా ఒక్కసారిగా డిజిఎం ఆనందరావుపై మండిపడ్డారు. టిడిపి, బిజెపి, జనసేన నాయకులు, కార్యకర్తలు ఎన్నికల్లో కష్టపడి పనిచేయడంతో ఈ ప్రభుత్వం ఏర్పడిందని, ప్రభుత్వ కార్యక్రమైనా, పార్టీకార్యక్రమైనా కూటమి నాయకులకు, కార్యకర్తలకు పాల్గొనే అధికారంతో పాటు స్టేజ్‌పై కూర్చునే అధికారం ఉందని చాలా గట్టిగా వాదించుకున్నారు. ఇరు వర్గాలు చాలా విమర్శలు చేసుకున్నారు. నోడల్ ఆఫీసర్ ఝాన్సీ మాట్లాడుతూ ఇది ప్రభుత్వ కార్యక్రమం కాబట్టి విమర్శలకు వేదిక కాదని దయచేసి విమర్శలు ఆపాలని కోరారు. ఆనంతరం ఎమ్మెల్యే ఈశ్వరరావు హాజరయ్యే సమయానికి గందరగోళం సద్దుమణిగింది.

వాదులాడుకుంటున్న కూటమి నాయకులు

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

ప్రజాశక్తి- పాతపట్నం

రాజు (ఫైల్)

మండలంలోని బగంతరకు చెందిన వాండ్రాడ రాజు (32) బుధవారం రాత్రి విద్యుదాఘాతానికి గురై మృతి చెందారు. మృతుడు ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తూ... కుటుంబాన్ని పోషించేవాడు. రాత్రి 8 గంటల ప్రాంతంలో మూత్ర విసర్జనకు పెరటికు వెళ్లి వస్తున్నాడు. వంటపాకలోని వేలాడుతున్న విద్యుత్ వైర్‌ను గమనించకుండా తాకడంతో షాక్ గురయ్యాడు. దీనిని గుర్తించిన ఆయన భార్య రజిని, తండ్రి పోలయ్య చూసి విద్యుత్ లైన్ ఆపించారు. అనంతరం ఆటోలో పాతపట్నం ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. వైద్యులు పరీక్షించగా అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని పరిశీలించారు. పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు ఎఎస్‌ఐ శ్రీనివాసరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు. కుటుంబ పెద్దను కోల్పోవడంతో కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

బోల్తా పడిన లారీ

గ్రానైట్ లారీ బోల్తా

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

మండలంలోని నర్సింగపల్లి గ్రామ సమీపంలో బుధవారం అర్ధరాత్రి రెండు గ్రానైట్ బ్లాక్‌లతో వెళ్తున్న వాహనం బోల్తా పడింది. ఈ ప్రమాదంలో డ్రైవరు, క్లీనరు సురక్షితంగా బయటపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసు ఘటనాస్థలానికి చేరుకోనున్నారు. స్థానికులు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. గత మూడు నెలలుగా కూటమి ప్రభుత్వం వచ్చి గ్రానైట్ లావాదేవీలు, గ్రానైట్ రవాణాలు సాగటం లేదు. నిలిచిపోయిన గ్రానైట్ వ్యాపారం. అయినా ఈ గ్రానైట్ ఎక్కడి నుంచి ఎక్కడికి వెళ్తుంది. మైన్స్ అధికారులు కనుసనల్లోనే ఇటువంటి అక్రమ రవాణాలు సాగుతున్నాయా? అని పలువురు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. నంబరు ప్లేట్లకి బురద రాసి అక్కడే డ్రైవర్, క్లీనరు కాపలా ఉండటాన్ని పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికే విశ్వసముద్ర అనే ప్రయివేటు ఆర్గనైజర్‌కి గత ప్రభుత్వం అప్పగించింది. అదీ ఇప్పటివరకు ఆ సంస్థ నుంచి ఎవరికీ ఎటువంటి అనుమతులూ ఇవ్వడం లేదు. ఈ నేపథ్యంలో ఇలా అక్రమ రవాణాలో సాగుతున్నాయా? అని అనుమానం వ్యక్తం అవుతుంది.

ప్రశ్నాపత్రాన్ని ఆవిష్కరిస్తున్న గోవిందరావు, తదితరులు

మూఢ నమ్మకాలు విడనాడాలి

ప్రజాశక్తి- లావేరు

మూఢనమ్మకాలను విడనాడాలని జెవివి పర్యావరణ కమిటీ జిల్లా కన్వీనర్ పూజారి గోవిందరావు అన్నారు. గురువారం బుడుమూరు జెడ్‌పి పాఠశాలలో చెకుముకి సైన్స్ టాలెంట్ పరీక్షలు నిర్వహించారు. విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం పెంపొందుతుందని అన్నారు. ప్రథమ స్థానంలో గెలుపొందిన ముగ్గురు విద్యార్థులు అక్టోబర్ 1న జరిగే మండల స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం ఉరిటి శ్రీనువాసరావు, ఉపాధ్యాయులు ఎస్.కె.ప్రసాద్, ఎం.అనురాధ, కె.వెంకటరావు, పడాల తమ్మినాయుడు, పెంటయ్య, రమేష్ బాబు, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అర్బన్ మార్కెట్‌ను పరిశీలిస్తున్న మెప్మా పీడీ

అర్బన్ మార్కెట్లతో ఆర్థిక తోడ్పాటు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

పట్టణ స్వయం సహాయక సంఘాల ఆర్థిక తోడ్పాటుకు మెప్మా అర్బన్ మార్కెట్ల నిర్వహణ చేస్తున్నట్లు మెప్మా ఇన్‌ఛార్జి పీడీ ఎస్.వి.రమణ తెలిపారు. గురువారం నగరంలోని రైతుబజార్ సమీపంలో నిర్వహించిన అర్బన్ మార్కెట్‌ను సందర్శించారు. స్వయం సహాయక సంఘాలు తయారు చేసే ఉత్పత్తులను వినియోగదారులకు పరిచయం చేసి, నైపుణ్యతను, పోటీతత్వం పెంపొందించేకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. జిల్లాలో నగరపాలక సంస్థతో పాటు, మూడు పురపాలక సంఘాల్లో పట్టణ ప్రగతి, సమృద్ధి యూనిట్లు ఏర్పాటు చేసి ప్రోత్సహించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో సిబ్బంది ఎస్.వెంకటరావు, బి.భాస్కరరావు, బి.రామారావు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థినుల ఎంపిక

పొందూరు: శ్రీకాకుళం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో లోలుగు కెజిబివికి చెందిన ముగ్గురు విద్యార్థినులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు గురువారం ప్రిన్సిపాల్ ఆర్.సౌమ్య, వ్యాయామ ఉపాధ్యాయులు ఎం.రూపవతి తెలిపారు. అండర్-14 విభాగంలో షాట్‌పుట్‌లో డి.హాసిని మొదటిస్థానం, అండర్-17 విభాగంలో కె.జానకి, డిస్కస్ త్రోలో మూడో స్థానం, అండర్-17 విభాగంలో ఎం.ద్రాక్ష షాట్‌పుట్‌లోను, డిస్కస్ త్రోలోను మొదటి స్థానంలో నిలిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పేర్కొన్నారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థినులను ప్రిన్సిపాల్ సౌమ్య, ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది అభినందించారు.

ఎంపికైన కెజిబివి విద్యార్థినులు

నవంబరు 17న జిల్లా మహాసభ

ప్రజాశక్తి- పోలాకి

నవంబరు 17న జట్టు కళాసీల సంఘం జిల్లా మహాసభ నిర్వహిస్తున్నామని, దీనిని విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా కార్యదర్శి కె.సూరయ్య పిలుపునిచ్చారు. పోలాకి కేంద్రంలో కార్మిక భవనం వద్ద గురువారం సమావేశం నిర్వహించారు. ముందుగా సిపిఎం జాతీయ కార్యదర్శి సీతారాం ఏచూరి మృతికి సంతాపం ప్రకటించారు. ఈ సందర్భంగా ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. అనంతరం మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు హమాలీలకు సమగ్ర చట్టాలు చేయాలని డిమాండ్ చేశారు. హమాలీలు తక్కువ జీతాలతో దుర్భర జీవితాలు అనుభవిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పిఎఫ్, ఐఎస్‌ఐ, 8 గంటలు పనిదినాలు వంటి చట్టాలు అమలు చేయడం లేదని విమర్శించారు. కార్మికులందరికీ ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలన్నారు. ఈ సమస్యలు పరిష్కరించకుంటే పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో అధ్యక్షుడు పాలబోయిన శ్రీనివాసరావు, టెంక సూర్యనారాయణ, వాకుముల్లు గోవిందరావు, డి.ప్రసాదరావు, కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఏచూరి చిత్రపటం వద్ద నివాళ్లర్పిస్తున్న కళాసీలు

కిష్టుపురంలో వైద్యశిబిరం

'ప్రజాశక్తి' కథనానికి స్పందన

ప్రజాశక్తి- పలాస

మండలంలోని కిష్టుపురంలో వైద్య శిబిరం, పారిశుధ్య పనులు గురువారం చేపట్టారు. పలాస డివిజనల్ ఇన్‌ఛార్జీ పంచాయతీ అధికారి ఐ.వి.రమణ సందర్శించారు. ఈ నెల 26న 'ప్రజాశక్తి'లో 'మంచం పట్టిన కిష్టుపురం' అనే శీర్షికతో కథనం వెలువడింది. దీనిపై అధికారులు స్పందించారు. గ్రామంలో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగించారు. బావులు, బోర్లు క్లోరినేషన్ చేయించారు. మురుగు కాలువల్లో పూడికలు తొలగించి బ్లీచింగ్ వేశారు. రమణ మాట్లాడుతూ గ్రామంలో పారిశుధ్య పనులు చేపట్టామని తెలిపారు. అనంతరం వైద్య శిబిరాన్ని పరిశీలించారు. ఈయనతో పాటు మండల పంచాయతీ విస్తరణాధికారి మెట్ట వైకుంఠరావు, కార్యదర్శి లండ శ్రీధర్, ధర్మసాయి, బూరెల కృష్ణంరాజు పాల్గొన్నారు.

వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న రమణ

అలాగే వెంకటాపురం పిహెచ్‌సి ఆధ్వర్యాన వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యాధికారులు అంజలి, దేవి 54 మందికి రక్త నమూనాలను సేకరించారు. ఇందులో 12 మందికి జ్వరాలు ఉన్నట్లు గుర్తించారు. అనంతరం మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్లు వెంకటరావు, లక్ష్మీనారాయణ, ఎఎన్ఎం జయంతి పాల్గొన్నారు.

రేపు బాలు స్వరాంజలి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

సినీ నేపథ్య గాయకులు పండితారాధ్యుల బాలసుబ్రహ్మణ్యం వర్ధంతిని పురస్కరించుకుని ఘంటసాల, బాలు, జి.ఆనంద్ స్వరమాధురి వెల్ఫేర్ అండ్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యాన నగరంలోని బాపూజీ కళామందిర్‌లో శనివారం స్వరాంజలి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు కెఎల్ఎన్‌మూర్తి, కార్యదర్శి డా.నిక్కు అప్పన్నలు ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా వర్ధంతి సభ జరుగుతుందని, ఈ సభకు ఎమ్మెల్యే గొండు శంకర్ ముఖ్యఅతిగా హాజరవుతారని, కార్యక్రమంలో ప్రముఖ రంగస్థల కళాకారులు ఎల్.రామలింగస్వామిని ఘనంగా సత్కరించనున్నట్లు తెలిపారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

క్రీడాకారుల పయనం

ఇచ్ఛాపురం: జ్ఞాన భారతి సీనియర్ సెకండరీ పాఠశాల చెందిన విద్యార్థులు ఈ నెల 27 నుంచి హైదరాబాద్‌లో జరగనున్న సౌత్ జోన్ హ్యాండ్ బాల్ పోటీల్లో పాల్గొనేందుకు గురువారం పయనమయ్యారు. అండర్-19 బాలురు విభాగంలో వారు పోటీ పడనున్నారు. జ్ఞాన భారతి జట్టులో 16 మంది విద్యార్థులు ఉన్నారు. అదేవిధంగా ఈ నెల 27 నుంచి గుంటూరులో జరిగే సిబిఎస్ ఈ క్లస్టర్-7 బ్యాడ్మింటన్ పోటీల్లో పాల్గొనేందుకు బాలురు జట్టు బయలుదేరి వెళ్లింది. బ్యాడ్మింటన్ పోటీల్లో అండర్-14 విభాగంలో ఇద్దరు బాలురు, అండర్-19 విభాగంలో ఇద్దరు బాలురు పోటీలో పాల్గొనడానికి తరలివెళ్లారు. వారితో పాటు పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు కైలాస్ కుమార్ పండా, డి.రాము వెళ్లారు. ఇచ్ఛాపురం రైల్వే స్టేషన్ వద్ద జ్ఞాన భారతి ఎడ్యుకేషనల్ ట్రస్ట్ సెక్రెటరీ, సిఇఒ జోహార్ ఖాన్ విజయోస్తు ఆశీస్సులు అందించారు. కార్యక్రమంలో ట్రస్టీ వజ్రపు రమణమూర్తి, ప్రిన్సిపాల్ ఐ.బి.పండా, హెడ్‌మిస్ట్రెస్ రషీదా సుల్తానా, మేనేజర్ ప్రమోద్‌కుమార్, అదనపు పరిపాలనా అధికారి సయ్యదా సుల్తానా, ట్రాన్స్‌పోర్టు మేనేజర్ అలీమ్ ఖాన్ పాల్గొన్నారు.

క్రీడాకారులతో జోహార్‌ఖాన్

రైతుల సమస్యలను పరిష్కరించాలి

ప్రజాశక్తి- కొత్తూరు

మండలంలోని కర్లెమ్మ రెవెన్యూ పరిధిలో గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన రీ సర్వేలో రైతుల పేర్లు తప్పుగా నమోదయ్యాయని, వాటిని సరిచేసేందుకు కృషి చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు సిర్ల ప్రసాద్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మండలంలోని మెట్టూరు బిట్-3లో గురువారం నిర్వహించిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే మామిడి గోవిందరావును రైతులతో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రీ సర్వేలో తప్పులు దొర్లడంతో ఈ-క్రాప్, రైతు భరోసా పేర్ల నమోదులో రైతులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. అప్పటి విఆర్ఒ రామారావు, సర్వేయర్ గిరిరాజు, ప్రత్యేక డిటి అనంత కుమార్‌లు చేతివాటం ప్రదర్శించడంతో రికార్డుల్లో పేర్లు తారుమారయ్యాయని అన్నారు. వారం రోజుల నుంచి వినతిపత్రాలు, ఆందోళనలు, రాస్తారోకోలు నిర్వహించినా అధికారులు పట్టించుకోవడం లేదని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. వినతిపత్రం అందజేసిన వారిలో రైతులు పి.యతిరాజు, ఎం.కృష్ణారావు, చోడవరపు రాము, వెంకటరమణ పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న ప్రసాద్, రైతులు

కేశవరావుపేటలో గ్రామసభ

గ్రామసభలో సమస్యలపై చర్చిస్తున్న గ్రామస్తులు

ప్రజాశక్తి- ఎచ్చెర్ల

మండలం కేశవరావుపేటలో సర్పంచ్ పైడి భాస్కరరావు అధ్యక్షతన గురువారం గ్రామసభ నిర్వహించారు. విజన్ డాక్యుమెంట్ స్వర్ణాంధ్ర 2047, స్వచ్ఛతా హీ సేవపై ఈ సభలో ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో భాగంగా గ్రామానికి అవసరమైన మౌలిక వసతులు, స్వయం ఉపాధి కల్పన, పేదరిక నిర్మూలనకు అమలయ్యే వివిధ ప్రభుత్వ పథకాలు, చెత్త నుంచి సంపద తయారీ, పరిసరాల పరిశుభ్రత విషయాలపై చర్చించారు. గ్రామంలో చినుకు పడితే సుమారు 200 మీటర్ల పొడవు వర్షపు నీరు నిలిచిపోతుంది. ఈ గ్రామం గుండా సుమారు ఐదు గ్రామాల ప్రజలు రాకపోకలు నిర్వహిస్తున్నారు. ఇటీవల కాలంలో నీరు ఎక్కువగా ఉండటంతో గుంతల కారణంగా ఎన్నో ప్రమాదాలకు ప్రజలు గురయ్యారని, తక్షణమే కాలువలు ఏర్పాటు చేయాలని గ్రామస్తులు సభ దృష్టికి తీసుకువచ్చారు. అలాగే గ్రామానికి లైన్‌మేన్ లేకపోవడంతో విద్యుత్ సమస్య ఎక్కువగా నెలకొందని, వీధి దీపాల సమస్యతో పాటు ట్రాన్స్‌ఫార్మర్లు లోఓల్టేజీ సమస్య ఎక్కువుగా ఉందని తెలిపారు. ఎంపిటిసి సూర జగదీశ్వరరావు, మాజీ సర్పంచ్ పొందూరు భీమారావు, వైస్ ప్రెసిడెంట్ గురుగుబెల్లి లక్ష్మణ్‌నాయుడు, కార్యదర్శి పూజారి సతీష్ కుమార్, నాయకులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కూలి రేట్ల జిఒ విడుదల చేయాలి

లావేరు : కళ్లకు గంతలు కట్టి నిరసన తెలుపుతున్న హమాలీలు

ప్రజాశక్తి- లావేరు

సివిల్ సప్లై హమాలీల కూలి రేట్లు జిఒ వెంటనే విడుదల చేయాలని లావేరు పౌరసరఫరాల గోదాం హమాలిలు గురువారం గోదాం వద్ద వినూత్నంగా కళ్లకు నల్ల గంతలు కట్టుకొని నిరసన తెలిపారు. సివిల్ సప్లై హమాలీల కూలి రేట్లు అగ్రిమెంట్ జిఒ వెంటనే విడుదల చేయాలని నినాదాలు చేశారు. ఎఐటియుసి రాష్ట్రసమితి పిలుపు మేరకు రెండు రోజులగా నిర్వహిస్తున్న నిరసన కార్యక్రమంలో భాగంగా లావేరు ఎంఎల్ఎస్ స్టాక్ పాయింట్ వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కష్టానికి తగ్గ కూలి రేట్లు ప్రభుత్వం అందించక కుటుంబాలతో అర్ధాకలితో అలమటిస్తున్నామని, హమాలీలకు తక్షణమే కూలి రేట్లు అగ్రిమెంట్ జిఒ విడుదల చేసి అమలు చేయాలని, 20వ తేదీ తరువాత చెల్లిస్తున్న కూలీ బిల్లులు ప్రతినెల పదో తేదీలోపల చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో హమాలీలు పసుపురెడ్డి భుజంగరావు, జగది, బారుకుల శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

కోటబొమ్మాళి: సివిల్ సప్లయి హమాలీల కూలి రేట్ల ఒప్పంద జిఒను తక్షణమే విడుదల చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు కె.శ్రీమన్నారాయణ డిమాండ్ చేశారు. ఎఐటియుసి రాష్ట్ర పిలుపు మేరకు స్థానిక సివిల్ సప్లయి గొడౌన్ వద్ద గురువారం నల్లబడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రెక్కలు కష్టానికి తగ్గ కూలీ రేట్లు ప్రభుత్వం అందించక అర్ధాకలితో అలమటిస్తున్న ఆవేదన వ్యక్తం చేశారు. హమాలీ కార్మికులకు తక్షణమే కూలీ రేట్లు ఒప్పంద జిఒను విడుదల చేసి అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రతినెలా పదో తేదీకల్లా కూలీ రేట్లు చెల్లించాలని డిమాండ్ చేశారు. రేషన్ షాపులో కుదింపును నిలుపుదల చేయాలని, పాత పద్ధతిలో సరుకుల రవాణా చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు మక్క నారాయణ రెడ్డి, చిక్కాల గోవిందరావు, కల్‌నాయక్ పాల్గొన్నారు.

కోటబొమ్మాళి : నిరసన తెలుపుతున్న హమాలీలు

మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ

మొక్కను నాటుతున్న ఎమ్మెల్యే శిరీష

పలాస : మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ అని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. మండలంలోని చినబడాం చెరువు గట్టు వద్ద కర్రల డిపో యజమాని నర్తు రామారావు కుమార్తె దేవి పుట్టిన రోజు సందర్భంగా గురువారం ఎమ్మెల్యే మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మొక్కలు నాటడం ద్వారా మానవాళికి ప్రాణవాయువు లభిస్తుందన్నారు. ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో చెట్లు సంఖ్య గణనీయంగా తగ్గిపోయిందని, పర్యావర ణాన్ని సమతుల్యంగా ఉంచాలంటే మొక్కలు నాటడం తప్పనిసరిగా నాటాలని పిలుపునిచ్చారు. నర్తు రామారావు తన కుమార్తె పుట్టినరోజు సందర్భంగా 500 మొక్కలు నాటడం ఆనందంగా ఉంద న్నారు. ప్రతిఒక్కరూ ఇలా పుట్టిన రోజు, పెళ్లి రోజు, పండుగ దినాల్లో మొక్కలు నాటడం ఒక దినచర్యగా చేసుకోవాలన్నారు. బిజెపి ఇన్‌ఛార్జి రామానందస్వామి, బిజెపి జిల్లా కార్యదర్శి ఎన్.రామారావు, పట్టణ అధ్యక్షుడు వైశ్యరాజు మోహన్‌రాజు, టిడిపి పట్టణ అధ్యక్షుడు బడ్డ నాగరాజు, సూర్యతేజ కళాశాల కరస్పాండెంట్ దానేటి పద్మజీ, నర్తు రామారావు కుటుంబ సభ్యులు ఎన్.పుణ్యవతి, లోకేష్, ప్రసన్న, హరికృష్ణ, ఎన్.పవన్‌కుమార్ పాల్గొన్నారు.

పుష్పగుచ్ఛం అందజేస్తున్న గ్రానైట్స్ యజమానులు

విజయలక్ష్మి బాధ్యతల స్వీకరణ

టెక్కలి : టెక్కలి భూగర్భ గనుల శాఖాధికారిగా విజయ లక్ష్మి గురువారం బాధ్యతలను స్వీకరించారు. గతంలో ఇక్కడ ఎడిగా పనిచేసిన ఫణిభూషణ్‌రెడ్డి రాజమండ్రి బదిలీ కాబడడంతో ఈయన స్థానంలో విజయలక్ష్మిని ప్రభుత్వం నియమించింది. ఈమె విజయనగరం మైన్స్ కార్యాలయంలో విజిలెన్స్ విభాగంలో విధులు నిర్వహించి ఇక్కడకు బదిలీపై వచ్చారు. విజయలక్ష్మికి కార్యాలయ సిబ్బంది పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. అనంతరం గ్రానైట్స్ యజమానులు మదుఖాన్ శ్రీనివాస్, నారాయణ, అల్లు నగేష్ మర్యాదపూర్వకంగా కలుసుకుని తమ సమస్య పరిష్కారానికి చొరవ చూపాలని కోరారు.

బాబూరావుకు అభినందనలు

చంద్రబాబుతో బాబూరావు

పలాస : రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన వజ్జ బాబూరావును సిఎం చంద్రబాబు అభినందించారు. విజయవాడలో చంద్ర బాబును గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సిఎం చైర్మన్ పదవి సక్రమంగా చేపట్టాలని, వ్యాపారులకు సహాయకారిగా ఉండాలని సూచించినట్లు ఆయన తెలిపారు.

లోకేష్‌కు ఘన స్వాగతం

ప్రజాశక్తి- రణస్థలం రూరల్

విద్యాశాఖ మంత్రి లోకేష్ జిల్లా ఆకస్మిక పర్యటనకు విచ్చేసిన సందర్భంగా ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు మండల కేంద్రం రామతీర్థాల జంక్షన్ వద్ద స్వాగతం పలికారు. ఆయనతో పాటు కూటమి నాయకులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఇఇ శేఖర్‌బాబు

అచ్చినాపురం సందర్శన

ప్రజాశక్తి- మెళియాపుట్టి

మండలంలోని అచ్చినాపురం గిరిజన గ్రామాన్ని వంశధార ఇఇ శేఖర్‌బాబు గురువారం సందర్శించారు. గిరిజనులు ఆఫ్‌షోర్ కెనాల్‌కు సంబంధించి తమకు పరిహారం అందించలేదని గ్రామస్తులు ఉన్నతాధికారులకు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆయన సందర్శించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలోని ఇళ్లు శిథిలావస్థకు గురయ్యాయని, ఆఫ్‌షోర్ ఇళ్ల బాధితులకు అందించిన విధంగా పరిహారం ఇవ్వాలని గిరిజనులు కోరారు. దీనిపై ఇఇ స్పందిస్తూ... కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరిస్తానని హామీనిచ్చారు. కార్యక్రమంలో తహశీల్దార్ హనుమంతరావు, ఆర్‌ఐ వైకుంఠరావు, విఆర్‌ఒ పాల్గునరావు, గిరిజన సంఘం నాయకులు వరహాల కృష్ణారావు, జన్ని కూర్మారావు, వరలక్ష్మి పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేస్తున్న కిరణ్‌కుమార్

జనసేన ఆర్థికసాయం

ప్రజాశక్తి- మెళియాపుట్టి

మండలంలోని పరశురాంపురం పంచాయతీ హీరాపురానికి చెందిన తిప్పన వంశీ కాలు విరిగిపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులకు గురవుతున్నారు. విషయం తెలుసుకున్న జనసేన మండల నాయకులు లక్ష్మీపురం కిరణ్, బాలరాజు వంశికి గురువారం రూ.పది వేలు ఆర్థికసాయం అందజేశారు. ఇంకా ఎటువంటి సహాయ, సహకారాలు కావాలన్నా తమ వంతు తోడ్పాటు అందిస్తామని హామీనిచ్చారు. కార్యక్రమంలో నాయకులు దుక్క బాలరాజు, సవర రామ్మూర్తి, సవర చిన్నబాబు, శ్రీరాములు, చిరంజీవి పాల్గొన్నారు.

స్థలం మంజూరు చేయాలి

ఆమదాలవలస: తాలూకా యూనిట్ ఎన్‌జిఒ సంఘ నాయకులు తహశీల్దార్ రాంబాబును మర్యాద పూర్వకంగా గురువారం కలిశారు. గత కొంతకాలం నుంచి ఎన్‌జిఒ సంఘ కార్యాలయ నిర్మాణానికి స్థలం మంజూరు చేయాలని కోరుతున్నట్లు అధ్యక్షులు వై. అప్పలరాజు, కార్యదర్శి నక్క రమణమూర్తి తెలిపారు. ఇటీవల జిల్లా కలెక్టర్‌కు స్థలం మంజూరు చేయాలని వినతి పత్రం అందించగా ఆయన తదుపరి చర్యలకు తహశీల్దార్ కార్యాలయానికి ఆదేశాలు ఇచ్చారని ఎన్‌జిఒ సంఘ నాయకులు పేర్కొన్నారు. కలెక్టర్ మెమోకు రిప్లైగా కార్యాలయంలో, జనవాసాలు ఉండే ప్లేస్‌లో స్థలం సర్వే చేయాలని కోరేందుకు కార్యవర్గ సభ్యులు మర్యాద పూర్వకంగా తహశీల్దార్‌ను కలిసినట్టు అధ్యక్షులు వై. అప్పలరాజు తెలిపారు.

కోటబొమ్మాళి ఖ్యాతిని ఇనుమడింపజేస్తాం

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

కోటబొమ్మాళి ఖ్యాతిని రాష్ట్రస్థాయిలో ఇనుమడింప చేస్తామని టిడిపి రాష్ట్ర కార్యదర్శి, కళింగవైశ్య రాష్ట్ర అధ్యక్షుడు బోయిన గోవిందరాజులు అన్నారు. ఈ మేరకు గురువారం విలేకరులతో మాట్లాడారు. మొనుపెన్నడులేని విధంగా స్థానిక కొత్తమ్మతల్లి ఉత్సవాలు వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు చొరవతో రాష్ట్ర పండగగా ప్రకటించడం అభినందనీయమన్నారు. ఈ నేపథ్యంలోనే ఉత్సవాలను వచ్చి అక్టోబరు 1 నుంచి 3 వరకు కలెక్టర్, ఎస్‌పి, ఇతర అధికారుల సమన్వయంతో అంగరంగ వైభవంగా నిర్వహిస్తామని అన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు, పగటి వేషాలు, కబడ్డీ పోటీలు ఉంటాయని అన్నారు. ఎప్పటికప్పుడు పారిశుధ్య కార్మికులు నిర్వహిస్తామని తెలిపారు.

ఉద్యోగులు బాధ్యతగా వ్యవహరించాలి

సరుబుజ్జిలి: ప్రభుత్వ ఆదేశాల మేరకు మండలంలో నిర్వహించాల్సిన ప్రతి కార్యక్రమంలో క్షేత్రస్థాయి ఉద్యోగులు బాధ్యతగా వ్యవహరించాలని ఎంపిడిఒ పి.వి.వి.మురళీమోహన్ కుమార్ అన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో కార్యదర్శులు, సచివాలయ సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 28న పంచాయతీల్లో నిర్వహించనున్న స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాలను ఎటువంటి ఇబ్బందులు లేకుండా సక్రమంగా నిర్వహించాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి జె.ఆనందరావు, మండల పరిషత్ కార్యాలయ ఎఒ బి.వి.ప్రసాదరావు, మండల కో-ఆర్డినేటర్ రమణబాబు పాల్గొన్నారు.

సాంకేతిక పరిజ్ఞానం పెంచుకోవాలి

పొందూరు: విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానం పెంపొందించుకోవాల్సిన ఆవశ్యకత ఉందని ఎంఇఒ-2 పి.రాజారావు అన్నారు. మండలంలోని తాణేం ప్రాథమికోన్నత పాఠశాలలో గురువారం బెజ్జిపురం యూత్‌క్లబ్ అందించిన సైన్స్ కిట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఇఒ మాట్లాడుతూ అంటు వ్యాధులు ప్రబలకుండా వ్యక్తిగత పారిశుధ్యం పాటించాలని విద్యార్థులకు సూచించారు. యూత్‌క్లబ్ ప్రతినిధులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

వ్యర్థాలతో కళాకృతులు

ప్రజాశక్తి- పలాస

ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు వ్యర్థాలతో కళాకృతులు ఎంతో ఆకట్టుకున్నాయి. గురువారం వేస్ట్ టూ వెల్త్ కార్యక్రమంలో భాగంగా ఉపయోగించి పారబోసిన వ్యర్థాలతో విద్యార్థులు అందమైన కళాకృతులు చేసి ప్రదర్శించారు. ఈ సందర్భంగా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జె.వెంకటలక్ష్మి మాట్లాడుతూ ప్రకృతికి హానకరమైన వస్తువులు ఎంతో ప్రమాదకరమని, దీనివల్ల పర్యావరణం తీవ్రంగా దెబ్బతింటుందని అన్నారు. వ్యర్థాలతో తిరిగి రీ సైకిల్ చేయడంతో కొంత వరకూ పర్యావరణాన్ని రక్షించవచ్చన్నారు. కార్యక్రమంలో గణపతిరావు, వెంకటరమణ, మధు, నర్సింహులు పాల్గొన్నారు.

కళాకృతులను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం

ప్రజాశక్తి- పలాస

ప్రధానమంత్రి యోజన పథకం కింద మంజూరైన ఇళ్లు మార్చి నెలాఖరుకు పూర్తి చేయాలని, పూర్తి చేసిన ఇళ్లకు బిల్లులు చెల్లిస్తామని మున్సిపల్ కమిషనర్ ఎన్ రామారావు అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో గురువారం హౌసింగ్, సచివాలయం అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలో 1955 ఇళ్లు మంజూరు కాగా, 475 ఇళ్లు పూర్తయ్యాయన్నారు. 1056 వివిధ స్టేజ్‌ల్లో ఉండగా, ఇంకా 26 ఇళ్ల నిర్మాణాలు ప్రారంభం చేయ లేదన్నారు. వార్డుల్లో లబ్ధిదారులకు అవగా హన కల్పించి త్వరితగతిన ఇళ్ల నిర్మాణం చేపట్టేలా చూడా లన్నారు. సమావేశంలో హౌసింగ్ ఎఇ రాజమోహన్ పాల్గొన్నారు.

సోంపేట : ఇళ్ల నిర్మాణాలు మార్చి నాటికి పూర్తి చేయాలని ఎంపిడిఒ వెంకటరమణ ఆదేశించారు. మండల పరిషత్ కార్యాలయంలో కార్యదర్శులు, ఇంజినీరింగ్ సహాయకులు, హౌసింగ్ సిబ్బందితో మన ఇల్లు- మన గౌరవం కార్యక్రమంపై గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ నెల 28న ప్రతి సచివాలయ పరిధిలోని లబ్ధిదారులతో సమావేశాన్ని నిర్వహించాలన్నారు. అనంతరం గృహ నిర్మాణాలు వేగవంతమయ్యేలా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఇఒపిఆర్డఇ వి.వెంకటేశ్వర్లు, పరిపాలన అధికారి జి.భాస్కరరావు పాల్గొన్నారు.

పలాస : మాట్లాడుతున్న కమిషనర్ రామారావు

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

టెక్కలి రూరల్ : టెక్కలి సబ్ స్టేషన్ పరిధిలో అదిఆంధ్రావీధి, పాత జాతీయ రహదారి, బ్రహ్మణ వీధి, మెట్టవీధి, మండపొలం కాలనీ పరిధిలో శుక్రవారం విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నామని ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జి.శంకరరావు ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్‌లో 11 కెవి వార్షిక మరమ్మతులు చేయడంతో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నామని అన్నారు. వినియోగదారులు గమనించి సిబ్బందికి సహకరించాలని కోరారు

పలాస : పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధి గాంధీనగర్ ఫీడర్ కెటి రోడ్డులో నూతన ట్రాన్స్‌ఫార్మర్ ఫార్మర్ ఏర్పాటు చేయనున్న నేపథ్యంలో శుక్రవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు విద్యుత్‌శాఖ ఇఇ పి.యోగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని హరిశంకర్ థియేటర్ నుంచి బిఎస్‌ఎన్‌ఎల్ ఆఫీస్, న్యూ కాలనీ, చేపల బజార్, ఆర్కే పోలీస్ కాలనీ, గుల్లేశ్వరినగర్, తిలక్ నగర్, మల్లేశ్వరరావు ఆస్పత్రి రోడ్డు, గాంధీనగర్, మహారాణిపేట, ఆంధ్రా బ్యాంకు రోడ్డు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నామని అన్నారు.

వజ్రపుకొత్తూరు : మండలం వెంకటాపురం 11 కెవి ఫీడర్‌లో విద్యుత్ లైన్లపై ఉన్న కొమ్మలు తొలగించేందుకు చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. ఈ నేపథ్యంలో ఉదయం పది నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు లక్ష్మీపురం, కిష్టుపురం, పి.జె.పురం, గరుడఖండి, గోపాలపురం, సరియపల్లి, మహాదేవపురం, బట్టుపాడు, వెంకటాపురం గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నామని అన్నారు. వినియోగదారులు సిబ్బంది సహకరించాలని కోరారు.

మందస: మండలంలోని మేఘమాల ఫీడర్ పరిధిలో ఉన్న లైన్లపై ఉన్న కొమ్మలను తొలగిస్తున్నామని, ఈ నేపథ్యంలో శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నామని ఇఇ తెలిపారు.

మాట్లాడుతున్న ఆశాజ్యోతి

కౌమార దశ కీలకం

ప్రజాశక్తి- పలాస

కౌమార దశే కీలకమని సైకాలజిస్టు ఆశాజ్యోతి అన్నారు. మండలంలోని బ్రాహ్మణతర్లా ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు ఎస్.వి.రమణారావు అధ్యక్షతన గౌతు లచ్చన్న బలహీన వర్గాల సంస్థ, ఉత్తర అమెరికా తెలుగు సంఘం, హోప్ ఫర్ లైఫ్ ఫౌండేషన్ ఆధ్వర్యాన కౌమార దశపై విద్యార్థులకు గురువారం అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మాట్లాడుతూ భవిష్యత్ ఎలా ఉండాలో నిర్ణయించేది మన ప్రవర్తన, ప్రతి స్పందన, స్నేహితులని అన్నారు. ఈ దశలో జరిగే శారీరిక, మానసిక, ఉద్వేగ మార్పులు సర్వసాధారణమన్నారు. అనవరస ఆందోళనలు చెందుతూ ఎక్కువ సమయం అంతర్జాలం, సోషల్ మీడియాలో అపరిచిత వ్యక్తులతో గడుపుతూ... ఒత్తిడిని అదిగమించేందుకు మత్తు పదార్థాలకు బానిస అవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయమై ఎటువంటి కౌన్సెలింగ్ విద్యార్థులకు అవసరమైన అందిస్తామని తెలిపారు. అనంతరం విద్యార్థినులకు 300 సానిటరీ పాడ్స్ సంస్థ ద్వారా అందించారు. కార్యక్రమంలో హోప్ ఫర్ లైఫ్ ఫౌండేషన్ డాక్టర్ హిమజ, సైకాలజిస్టు సంగీత, దామోదర్, ఉపాధ్యాయులు అప్పన్న, ఈశ్వరరావు, మధుబాబు, రమేష్, కొయ్యల శ్రీనివాసరావు, పద్మలోచనం, జనార్ధనరావు, పద్మ, శివప్రసాద్, మెహర్ సుధ, కిషోర్, రజనికుమారి, జ్యోతమ్మ, అరుణకుమారి, కృష్ణవేణి పాల్గొన్నారు.

మైనర్లు వాహనం నడపడం నేరం

ప్రజాశక్తి- పొందూరు

మైనర్లు వాహనాలు నడపడం చట్టరీత్యా నేరమని ఎస్ఐ సత్యనారాయణ అన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం విద్యార్థులకు పలు చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మైనర్లుకు వాహనాలను ఇస్తే తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామన్నారు. అలాగే సెల్‌ఫోన్ డ్రైవింగ్, ద్విచక్ర వాహనంపై ముగ్గురు ప్రయాణించడం నేరమని తెలిపారు. గంజాయి, మత్తుపదార్థాలు వంటి వాటికి దూరంగా ఉండాలన్నారు. హెచ్‌ఎం పి. వెంకటరావు, మహిళా పోలీస్ లావణ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పోలాకి: ఆటో డ్రైవర్లు వాహనాలు నడిపేటప్పుడు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, లేకుంటే చర్యలు తప్పవని ఎస్ఐ జి.రంజిత్ హెచ్చరించారు. మండలంలోని ఈదులవలస కూడలి వద్ద ఆటోడ్రైవర్లకు గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటోడ్రైవర్లు ఖాకీ దుస్తులు ధరించా లన్నారు. ఆటోలో లౌడ్స్ స్పీకర్లు ఉండకూడదన్నారు. సెల్ ఫోన్‌లో మాట్లాడుతూ ఆటోలను నడపరాదన్నారు. పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించరాదన్నారు. డ్రైవర్ పక్కన ప్రయాణికులను కూర్చోపెట్టరాదని ఆదేశించారు. వాహనాలకు సంబంధించిన అన్ని ధ్రువపత్రాలు తప్పనిసరిగా తమ వెంటనే ఉండాలన్నారు.

పొందూరు : అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ సత్యనారాయణ

జిల్లా జడ్జికి ఆహ్వాన పత్రిక అందజేస్తున్న సభ్యులు

ఉత్సవాలకు ఆహ్వానం

కోటబొమ్మాళి: కోటబొమ్మాళి కొత్తమ్మతల్లి జాతర ఉత్సవాలు అక్టోబరు 1 నుంచి 3 వరకు నిర్వహించనున్న ఉత్సవాల్లో నాయకులు, అధికారులు పాల్గొవాలని ఆలయ కార్యనిర్వాహధికాని వాకచర్ల రాధాకృష్ణ, న్యాయవాది కింజరాపు అచ్చెన్నాయుడు, ఆలయ కమిటీ సభ్యులు దేవాది కృష్ణారావు, మంచాల వెంకటరావులు కోరారు. ఈ మేరకు విశాఖపట్నం డిసికి, ఎమ్మెల్యే ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావుకు, జిల్లా జడ్జికి గురువారం ఆహ్వాన పత్రికలను అందజేశారు.

60 మందికి నేత్ర వైద్య పరీక్షలు

టెక్కలి : మండలంలోని అక్కవరంలో గురువారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. విశాఖపట్నానికి చెందిన లోటస్ ఐ కేర్ విభాగం వైద్యులు, సిబ్బంది 60 మంది రోగులకు నేత్ర వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం ఆపరేషన్‌కు ఎంపికైన వారిని ప్రత్యేక వాహనంలో ఆస్పత్రికి తరలించారు. ముందుగా సర్పంచ్ పొట్నూరు భూలక్ష్మి ఈ శిబిరాన్ని ప్రారంభించారు.

ఎపిఎంకు సన్మానం

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

వెలుగు ఎపిఎం ఎం.ప్రసాదరావు ఇటీవల కంచిలి మండలానికి బదిలీ అయ్యారు. ఈ మేరకు గురువారం మండల సమైక్య సిబ్బంది దుశ్శాలువ కప్పి సన్మానించారు. మండలాన్ని ఆదర్శ మండలంగా తీర్చడానికి ప్రసాదరావు కృషి చేశారని అన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ కె.రామారావు, ఎపిఎం శ్రీనివాసరావు, దున్న మోహనరావు, దుంప లక్ష్మి, అకౌంటెంట్ కాళ్ల మోహిని, కంప్యూటర్ ఆపరేటర్ పి.విష్ణుబాబు, టిడిపి నాయకులు పద్మనాభం తదితరులు పాల్గొన్నారు.


రోడ్డు మీదుగా ప్రవహిస్తున్న నీరు

కోతకు గురైన రోడ్డు

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

అల్పపీడన ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు మండలంలోని కొండవూరు-పల్లివూరు మధ్యలో ఆర్అండ్‌బి రోడ్డుకు కోతకు గురైంది. వర్షపు నీరు రోడ్డుపైకి చేరి ఉధృతంగా ప్రవహించడంతో తారురోడ్డు మరమ్మతులకు గురైంది. దీంతో వాహనదారులు ఏ మాత్రం ఆదమరిచినా ప్రమాదం పొంచి ఉంది. సంబంధిత అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

చెత్త సంపద కేంద్రం పరిశీలన

మెళియాపుట్టి : మండలంలోని గొప్పిలిలో చెత్త సంపద తయారీ కేంద్రాన్ని టెక్కలి డిఎల్‌పిఒ ఐ.వి.రమణ గురువారం పరిశీలించారు. ఈ మేరకు తగు సూచనలు చేశారు. అలాగే స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో గ్రామంలోని డ్రెయిన్లను పరిశీలించారు. పారిశుధ్యం లోపించకుండా చూడాలని ఆదేశించారు. అనంతరం మొక్కలను నాటారు. పర్యావరణ పరిరక్షణకు మొక్కలు ఎంతో దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి సుదర్శన్, హరిత, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా...

ప్రజాశక్తి- కొత్తూరు

మండలంలోని కర్లెమ్మ పంచాయతీలో వెంకటేశ్వర డిగ్రీ కళాశాలలో విద్యార్థులు ఫ్రెషర్స్ డే వేడుకలు గురువారం నిర్వహించారు. డిగ్రీ కళాశాల డైరెక్టర్ జి.కృష్ణారావు మాట్లాడుతూ విద్యార్థుల మంచి భవిష్యత్‌కు ఇదే పునాదని అన్నారు. కష్టపడి చదివి తల్లిదండ్రులకు, కళాశాలకు మంచి పేరు తీసుకురావాలన్నారు. కరస్పాండెంట్ సుధావాణి మాట్లాడుతూ విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. అనంతరం సినీగీతాలకు నృత్యాలు చేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు బి.దిల్లేశ్వరరావు, పి.గిరిబాబు, జి.మహేష్‌బాబు, డి.షణ్ముఖరావు తదితరులు పాల్గొన్నారు.

యుజిసి నిబంధనలు పాటించాలి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

స్వయం ప్రతిపత్తి గల శ్రీకాకుళం ప్రభుత్వ మహిళా కళాశాలలో ఆర్థిక అంశాలు యుజిసి నిబంధనలకు లోబడి అమలు చేయాలని బిఆర్ అంబేద్కర్ విశ్వ విద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ బి.సుజాత సూచించారు. 2024-2025 విద్యా సంవత్సరానికి కళాశాల నిర్వహణకు సంబంధించిన ఆర్థిక అంశాలపై గురువారం కళాశాల ఫైనాన్స్ కమిటీ సమావేశంలో చర్చించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కళాశాలలో నిర్వహిస్తున్న కోర్సులు, విద్యార్థుల నుంచి వసూలు చేస్తున్న ఫీజులు, కళాశాలకు యుజిసి నుంచి విడుదలవుతున్న నిధులు తదితర అంశాలపై చర్చించారు. అలాగే పరీక్షల నిర్వహణపై పలు అంశాలు చర్చించారు. ఈ సమావేశంలో ఫైనాన్స్ కమిటీకి ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సూర్య చంద్రరావు చైర్మన్‌గా, వైస్ ప్రిన్సిపాల్ పి.శంకరనారాయణ, అకడమిక్ కో-ఆర్డినేటర్ సిహెచ్ కృష్ణారావు, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ టి.ఆదిలక్ష్మి, కార్యాలయ సూపరెంటిండెంట్ బి.లక్ష్మి సభ్యులుగా వ్యవహరించారు.

ఆర్థిక అంశాలపై చర్చిస్తున్న ప్రిన్సిపాల్ తదితరులు

ఉత్తరాంధ్ర వెనుకబాటుకు పాలకులే కారణం

మాట్లాడుతున్న మాధవరావు

ప్రజాశక్తి- పలాస

ఉత్తరాంధ్ర వెనుకబాటుకు పాలకులే కారణమని, ఏ పార్టీ అధికారంలో ఉన్న ఉత్తరాంధ్ర అభివృద్ధికి నోచుకోవడం లేదని సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి వంకల మాధవరావు విమర్శించారు. కాశీబుగ్గ సూదికొండ పార్టీ కార్యాలయంలో గురువారం విలేకరులతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం నాయకులు, వైసిపి నాయకులు, బిజెపి భజన చేస్తున్నారే తప్ప ప్రజలకు ఏమి సేవా చేస్తున్నారని ప్రశ్నించారు. వెనకబడిన ఉత్తరాంధ్రకు ప్రత్యేకంగా నిధులు కేటాయిస్తామని, పారిశ్రామిక అభివృద్ధి చేస్తామని కల్లబొళ్లు మాటలు చెప్పారే తప్ప ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. పదేళ్ల అధికారంలోని ఉత్తరాంధ్రకు బిజెపి ఏం చేసిందన్నారు. విశాఖ ఉక్కును అమ్మేస్తున్నా వైసిపి, టిడిపి ఎందుకు నోరు మెదపడం లేదని ప్రశ్నించారు. ఈ నెల 29న టెక్కలి అంబేద్కర్ భవనంలో సెమినార్ నిర్వహిస్తామని తెలిపారు. సమావేశంలో ఐఎఫ్‌టియు జిల్లా కన్వీనర్ జుత్తు వీరాస్వామి, పిడిఎస్‌యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మద్దిల వినోద్, ఎఐకెఎంఎస్ జిల్లా అధ్యక్షులు మామిడి భీమారావు, నాయకులు మురిపిండి తాతారావు, అరుణోదయ జిల్లా అధ్యక్షులు సొర్ర రామారావు, ఆదివాసీ సంఘం నాయకులు బంగ్లా కుమార్ పాల్గొన్నారు.

6 నుంచి ఎపిటిఎఫ్ రాష్ట్ర మహాసభలు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ఉపాధ్యాయ ఉద్యమాల్లో సుదీర్ఘ కాలం పోరాడిన ఎపిటిఎఫ్ 1938 సంఘం రాష్ట్ర మహాసభలు అక్టోబరు 6 నుంచి 8 వరకు విజయనగరంలోని ఫూల్‌బాగ్ కాలనీలో ఉన్న జె కన్వెన్షన్‌లో నిర్వహిస్తున్నట్టు సంఘ రాష్ట్ర అధ్యక్షులు జి.హృదయరాజు తెలిపారు. గురు వారం నగరంలోని ఎపిఎన్‌జిఒ కార్యాలయంలో రాష్ట్ర మహాసభల పోస్టర్‌ను జిల్లా నేతలతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ యూనియన్ ఆవిర్భవించి 80 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా 20వ రాష్ట్ర విద్య-వైజ్ఞానిక మహాసభల పేరుతో చేపట్టనున్న కార్యక్రమాలను విజయవంతం చేయాలన్నారు. స్వర్గీయ మార్పు బాలకృష్ణమ్మ పేరిట ఏర్పాటు చేయనున్న ప్రాంగణంలో ఈ మహాసభలు జరుగుతాయన్నారు. ఈ మహాసభల్లో విద్యావేత్తలు, మేధావులు పాల్గొనాలని కోరారు. విద్యా ప్రగతి, ఉపాధ్యాయుల సంక్షేమం, సమాజ శ్రేయస్సు, మహిళా సాధికారిత, నూతన విద్యావిధానం పేరిట కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ వైఖరి తదితర అంశాలపై చర్చ జరుగు తుందన్నారు. సమావేశంలో జిల్లా అధ్యక్షులు బల్లెడ రవి, ప్రధాన కార్యదర్శి బుక్కూరు వెంకటేశ్వర రావు, వాన కామేశ్వరరావు, ప్రసాదరావు, నవీన్, బి.వి. ఎస్.జితేంద్ర, అనంతా చార్యులు, భాస్కరరావు పాల్గొన్నారు.

పోస్టర్‌ను విడుదల చేస్తున్న ఎపిటిఎఫ్ నాయకులు

వినతిపత్రం అందజేస్తున్న గోవర్ధనరావు

సిమెంట్ ర్యాంపు ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

పట్టణంలో నిత్యం రద్దీగా ఉండే రైతు బజారు వద్ద ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పెద్దఎత్తున గుంతలు ఏర్పడ్డాయని, దీనివలన ఈప్రాంతంలో తరచూ వాహన ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని నగర పౌర సంక్షేమ వేదిక కన్వీనర్ మాతల గోవర్ధనరావు పేర్కొన్నారు. గురువారం నగరపాలక సంస్థ కార్యాలయంలో కమిషనర్ ప్రసాదరావును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ రోడ్డులో నిత్యం వేలాది మంది రాకపోకలు సాగిస్తుంటారని, కూరగాయలు, పాలు, ఇతర వస్తువులు రవాణా చేసేందుకు ఆటోలు, ఇతర వాహనాలు రాక పోకలు సాగిస్తుంటాయన్నారు. కల్వర్టులు కూలిపోయే స్థితికి చేరుకోవడంతో ఎప్పుడు ఏం జరుగుతుందోనన్న భయం వినియోగదారుల్లో వ్యక్తమవు తుందన్నారు. ఈ సమస్య పరిష్కరించాలని పలుమార్లు వినతిపత్రాలు ఇచ్చినా ఇంతవరకు పరిష్కారం చూపలేదన్నారు. తక్షణమే ఆ ప్రదేశంలో ర్యాంపును నెలకొల్పి వాహనదారుల సమస్యను పరిష్కరించాలని కోరారు.

పాడి రైతులకు దాణామృతం

సరుబుజ్జిలి: పశువులకు ప్రభుత్వం అందజేస్తున్న సమీకృత దాణామృతాన్ని పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ సిహెచ్. సుబ్రహ్మణ్యం అన్నారు. గురువారం మండలంలోని షలంత్రిలో పాడి రైతులకు సబ్సిడీపై అందిస్తున్న సమీకృత దాణామృతం కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం 60 శాతం సబ్సిడీపై అందజేస్తున్న ఈ దాణామృతం వినియో గించడం వలన పశువులు అనారోగ్యాలకు గురికావన్నారు. పాడి రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపిటిసి శివ్వాల సూర్యం, పశు వైద్యాధికారి సతీష్ కుమార్, పశుసంవర్ధక శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దాణామృతాన్ని రైతుకు అందజేస్తున్న ఎంపిటిసి సూర్యం

కాకినాడ ఎమ్మెల్యేపై చర్యలు తీసుకోవాలి

నందిగాం : దళిత వైద్యుడు ఉమామహేశ్వరరావుపై అవమానపరిచిన కాకినాడ ఎమ్మెల్యే పంతం నానాజీని తక్షణమే పదవి నుంచి తొలగించాలని ఎస్‌సి సెల్ కన్వీనర్ ఎ.సురేష్ ఒక ప్రకటనలో కోరారు. అలాగే ప్రశ్నించే గొంతు కనిపి చెప్పుకున్న డిప్యూటీ సిఎం ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. టిడిపి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత దళితులపై అకృత్యాలు పెరిగాయని అన్నారు.

రేపు ఆలయాల్లో పూజలు : వైసిపి

ప్రజాశక్తి- ఆమదాలవలస

తిరుమల పవిత్రతను లడ్డూ విశిష్టతను సిఎం చంద్రబాబు నాయుడు అపవిత్రం చేసిన కారణంగా ప్రక్షాళన చేసేందుకు దేవాలయాల్లో ప్రత్యేక పూజల కార్యక్రమాన్ని వైసిపి నాయకులు, కార్యకర్తలు జయప్రదం చేయాలని వైసిపి పార్లమెంటరీ నియోజకవర్గ పరిశీలకులు తమ్మినేని సీతారాం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వైసిపి అధ్యక్షుడు, మాజీ సిఎం జగన్మోహన్ రెడ్డి పిలుపుమేరకు ఈనెల 28న జిల్లాలోని అన్ని నియోజకవర్గాలు, మండల కేంద్రాల్లో వైసిపి నాయకులు స్థానిక ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించాలని కోరారు. ఈ పూజలతో కలియుగ దైవం వెంకటేశ్వర స్వామి ప్రతిష్టను, లడ్డూ విశిష్టతను, పవిత్రతను ప్రపంచ వ్యాప్తంగా ఇనుమడింప జేయాలని పిలుపునిచ్చారు. పార్టీ పిలుపు మేరకు ఈ కార్యక్రమాన్ని పార్టీ నాయకులు దిగ్విజయం చేయాలని ఆ ప్రకటనలో కోరారు.

నవరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు

ఇచ్ఛాపురం : మండలంలో ఈదుపురంలో దుర్గాదేవి శరన్నవరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లను కమిటీ సభ్యులు చేస్తున్నారు. ఈ మేరకు గురువారం నర్తు ప్రేమ్‌కుమార్ శుభరాట వేశారు. 20 ఏళ్లుగా శరన్నవరాత్రులు నిర్వహిస్తున్నామని కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో కొత్తపల్లి సంతోష్, ఎ.రాము, బుంగ రాజు, గిరి, జగదీష్, గోపాల్, రాజేష్, తరుణ్, అజయ్, కృష్ణ ఆపల్గొన్నారు.

పార్వతమ్మ మృతి తీరని లోటు

ప్రజాశక్తి- ఆమదాలవలస

ఒంగోలు మాజీ ఎంపీ, కావలి మాజీ ఎమ్మెల్యే మాగుంట పార్వతమ్మ మృతితో మంచి ఆత్మీయరాలను కోల్పోయానని మాజీ ఎమ్మెల్యే పిసిసి ఉపాధ్యక్షురాలు బొడ్డేపల్లి సత్యవతి విచారం వ్యక్తం చేశారు. 2009 ఎన్నికల్లో విజయం సాధించిన తర్వాత రాజశేఖర్ రెడ్డి, రోశయ్య, కిరణ్ కుమార్ రెడ్డి ప్రభుత్వంలో మహిళా ఎమ్మెల్యేలతో కుటుంబ సభ్యురాలిగా మెలుగుతూ అందరిని పలకరిస్తూ సఖ్యతగా ఉండేదని గుర్తు చేసుకున్నారు. సుదీర్ఘ రాజకీయ చరిత్ర కలిగి దశాబ్దాలుగా ప్రజల అభ్యున్నతికి పాటుపడుతూ ప్రజలతో మాగంటి కుటుంబానికి విడదీయలేని అనుబంధం ఉందన్నారు. పార్వతమ్మ మృతి ఆ ప్రాంత ప్రజలకు తీరని లోటన్నారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

రోడ్డును శుభ్రం చేస్తున్న కార్మికులు

పరిసరాల పరిశుభ్రత పాటించాలి

ఇచ్ఛాపురం : ప్రతిఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ కమిషనర్ రమేష్ సూచించారు. పురపాలక సంఘం పరిధిలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా గురువారం పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. అనంతరం శానిటరీ ఇనస్పెక్టర్ ఉపేంద్ర కుమార్ ఆధ్వర్యాన పారిశుధ్య కార్మికులు పురపాలక సంఘం కార్యాలయం, మెయిన్ రోడ్డును శుభ్రం చేయించారు. అలాగే ఉప్పాడ వీధిలో ప్రజలకు పారిశుధ్యం, పరిసరాల పరిశుభ్రత గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎన్విరాన్మెంట్ కార్యదర్శులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధిలో భాగస్వామ్యం అవసరం

నందిగాం: పదో తరగతి విద్యార్థుల ఫలితాలు మెరుగుపడేందుకు పటిష్టమైన ప్రణాళిక అవసరమని, వారి విజయావకాశాల్లో తల్లిదండ్రుల భాగస్వామ్యం అవసరమని మాజీ సర్పంచ్ మాదిన లోకనాథం అన్నారు. మండలంలోని లఖిదాసుపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు చిలుకు కృష్ణారావు అధ్యక్షతన గురువారం సమావేశం నిర్వహించారు. అనంతరం భౌతికశాస్త్ర ఉపాధ్యాయునిగా విధులు నిర్వర్తిస్తున్న తులసీప్రసాద్ జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకోవడంతో గ్రామస్తులు దుశ్శాలువ కప్పి సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రంకిడి రామారావు, బెందాళం రత్నం, గోవిందరాజు నక్క, ప్రియదర్శిని, సంధ్యారాణి, త్రినాథరావు పాల్గొన్నారు.